కథా నిలయం
3725
శ్రీకాకుళం

# పరిధులు

అతడెప్పుడూ దిగులుగా, వంటరిగా యేదో పోగొట్టుకుని దానికోసం వెతుక్కుంటున్న వాడిలా కనిపించేవాడు.

అతన్ని చూసినప్పుడల్లా యేమిటండి ఎప్పుడూ అలా దిగులుగా ఉంటారెందుకు? "వాట్స్ రాంగ్?" అని అడగాలినిపించేది నాకు. కాని అప్పుడే అతనితో అంత ఫ్రీడమ్ తీసుకోలేకపోయాను. నాకీ ఆఫీసు కొత్త. మనుష్యులు కొత్త. నేను పది రోజుల క్రితమే కొత్తగూడెం నుండి ఈ వరంగల్ ఆఫీసుకు ట్రాన్స్‌ఫర్ అయ్యాను. అప్పుడే ఈ అమ్మాయి ఇంత చనువు తీసుకుంటున్నదేమిటని అతడు గాభరాపడి పోతాడేమో!

అతని పేరు మోహన్‌రావు. సన్నగా పొడుగ్గా ఉంటాడు. చామనచాయ. విశాలమైన నుదురు. ఎప్పుడో యేదో ఆలోచిస్తున్నట్లుగా ఉండే కళ్ళు. ఎప్పుడోగాని ఎదుటి వ్యక్తిని సూటిగా చూసేవాడు కాదు. అతన్ని చూస్తున్నప్పుడల్లా నాకెందుకో ఇలాంటి వ్యక్తిని ఇదివరకెప్పుడో చూసినట్లుగా ఫీలయ్యేదాన్ని. అందుకేనేమో నాలో అతనితో పరిచయాన్ని పెంచుకోవాలన్న ఆతురత.

మోహనరావు మా సెక్షన్‌లోనే యు.డి.సిగా పనిచేస్తాడు. నేను ఎల్.డి.సి.ని. నాతో పాటు మా సెక్షన్‌లో మరో ఇద్దరు ఆడపిల్లలు కూడా పనిచేసేవాళ్ళు. వాళ్లతో నాకు త్వరగానే స్నేహం ఏర్పడింది.

స్నేహం విషయంలో నేను ఆడవాళ్లను మొగవాళ్లను వేర్వేరుగా చూసేదాన్ని కాదు. ఆడవాళ్లతో ఎలా పరిచయం పెంచుకుని స్నేహం చేసేదాన్నో మొగవాళ్లతో కూడా అలాగే చేసేదాన్ని.

"మగవాళ్లతో నువ్వలా చనువుగా మాట్లాడటం చాలా ప్రమాదమే వనజా!" అనేది కొత్తగూడెంలో నాతోపాటు పనిచేసిన సుభద్ర.

"ఎందుకు?"

"ఎందుకేమిటి? మన చనువును వాళ్ళు ఇంకోలా అర్థం చేసుకొని మనమీద లేనిపోని స్కాండల్స్ సృష్టిస్తారు - అమ్మో! ఈ మగవాళ్ళను నమ్ముతావా? మోస్ట్ డేంజరెస్ ఫెల్లోస్..."

''ఇలాంటి నిష్కారణమైన పురుష ద్వేషమంటే నాకు చాలా అసహ్యం. మగవాళ్లంతా దుర్మార్గులనుకుని మనం మన చుట్టూ గిరిగీసుకుని కూర్చుంటే వాళ్ళు అలాగే తయారవుతారు. మనం కాస్త మన పరిధిలోంచి బయటకొస్తే వాళ్ళు వాళ్ల పరిధిలోంచి బయటపడ్తారు. స్త్రీ పురుషుల మధ్య స్నేహమనేది చాలా అరుదు, కాబట్టి ఎక్కడైనా అలాంటిది కనిపిస్తే దాన్ని చిలువలు పలువలు చేసుకొని చెప్పుకోవడం జరుగుతోంది. అది చాలా మామూలైపోయినప్పుడు ఎవడూ దాన్నిగూర్చి పట్టించుకోరు''

''యేమోలేవే! నువ్వన్ని ఐడియల్స్ మాట్లాడతావు. నువ్విలాగే అందరితో చనువుగా ఉన్నావంటే ఎప్పుడో దెబ్బతింటావు జాగ్రత్త!'' అని హెచ్చరించేది సుభద్ర.

నేను నవ్వేసి ఊరుకునేదాన్ని.

వరంగల్ నాకు కొత్తేమీ కాదు. ఇక్కడ ఆఫీసులో జాయినయిన రోజే నాకు మా సెక్షన్‌లోనే పనిచేసే మిగతా ఇద్దరు ఆడవాళ్ళు కమల, కల్యాణిలతో పరిచయమేర్పడింది. ఆఫీసులో ఎవరెవరు ఎలాంటి వాళ్లో వాళ్ళు చెప్పారు.

నేను త్వరలోనే మా ఆఫీసులో పనిచేసే చాలామందితో పరిచయమేర్పరచుకున్నాను. అందరూ నాతో సరదాగానే మాట్లాడేవాళ్ళు ఒక్క మోహన్‌రావు తప్ప. మోహన్‌రావు నాతోనే కాదు ఎవరితోనూ సరిగ్గా మాట్లాడేవాడు కాదు.

అతన్ని గూర్చి ఒకరోజు లంచ్ టైమ్‌లో కమలనడిగాను.

''ఏమిటతడు! ఎప్పుడూ అలా మొరోజుగా ఉంటాడేమిటి''

''అతని ధోరణే అంత'' అంది కమల.

''అతడు లైఫ్‌లో ఏదో బాగా దెబ్బతిన్నట్టున్నాడే'' అంది మా ఇంకో కొలీగ్ కల్యాణి.

''అతనికి పెళ్ళయ్యిందా?'' అడిగాన్నేను.

''అతని వయస్సు ముప్పైదాకా ఉంటుందేమో. అంత వయస్సువాడు ఇంకా పెళ్ళి చేసుకోకుండా ఉంటాడా?'' అంది కమల.

''ఏమో... అతన్ని చూస్తే అతనికీ ప్రపంచంలో ఎవ్వరైనా ఉన్నారా అనిపిస్తుంది'' అంది కల్యాణి.

''పూర్ మ్యాన్!'' అన్నాన్నేను.

''ఎందుకు వనజా! అతనిమీద అకస్మాత్తుగా అంత జాలి వొలకబోశావేం?'' అంది కల్యాణి.

''ఎందుకేమిటి? మనతోపాటు మన సెక్షన్‌లో పనిచేసే మన కొలీగ్‌ను గూర్చి మనకేమ తెలియదు. పాపం అతడెప్పుడూ అంత దిగులుగా బాధగా ఎందుకుంటాడో తెలుసుకునే ప్రయత్నం మనం చెయ్యకపోవడం చాలా దారుణం కదూ?'' అన్నాను.

''మనకేమిటి మధ్య? అందులో ఈ మగవాళ్లతో చనువుగా ఉంటే ఇంకేమన్నా ఉందా?

మనతో తియ్యగా మాట్లాడినట్లే మాట్లాడతారు. మనవెనుకే గోతులు తవ్వుతారు. అందుకే మేం వీళ్ళతో ఆఫీసు వ్యవహారాల్ని మించి మరో విషయం మాట్లాడం'' అంది కల్యాణి.

నేను నవ్వాను.

ఆఫీసులో పనిచేసే చాలామంది ఆడవాళ్ళు ఇలాగే మాట్లాడతారు. మొగవాళ్ళు నిజంగా అంత దుర్మార్గులా? స్త్రీ పురుషులు సెక్స్‌తో ముడిపడని మామూలు స్నేహం ఏర్పడటానికి అవకాశం లేదా?

* * *

త్వరలోనే మా ఆఫీసులో నా ప్రవర్తన మా కమలకు, కల్యాణికి నచ్చడం లేదని గమనించాను.

మా ఆఫీసులో పనిచేసే మిగతా వాళ్ళందరితోను నేను పరిచయం చేసుకున్నాను. అందరితోనూ సరదాగా మాట్లాడేదాన్ని.

రమణారావు - ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లో ఉండేవాడు. ఎప్పుడూ మల్లెపూవుల్లాంటి తెల్లటి బట్టలు వేసుకుని చాలా కులాసాగా తిరుగుతుంటాడు. నేనుకూడా అతనితో సినిమాలను గూర్చే మాట్లాడేదాన్ని.

అలాగే ప్రసాద్ - ఎకౌంటెంట్ సెక్షన్‌లో పనిచేస్తాడు. క్రికెట్ అంటే పడి చచ్చేవాడు. ఆనందరావు - మా సెక్షన్ సూపరింటెండెంట్‌కు రాజకీయాల పిచ్చి. అధికారంలో ఉన్నన్నాళ్ళూ ఇందిరాగాంధీని తెగ పొగిడేవాడుట. ఇప్పుడు తెగ తిడ్తాడు. అతనితో రాజకీయాలను ముచ్చటించేదాన్ని.

ఇదంతా మా కమలకు, కల్యాణికి చాలా విపరీతంగా కనిపించేది. మొదట్లో నాతో కాస్త చనువుగా మాట్లాడిన వాళ్ళిద్దరూ ఇప్పుడు నాతో అసలు మాట్లాడటమే మానేశారు. వాళ్ల ప్రవర్తన నన్ను ఆశ్చర్యపరచలేదు. వాళ్ల మానసిక పరిధులు అంత సంకుచితమైనవి. ఆ పరిధుల్ని దాటే ప్రయత్నం వాళ్ళు చెయ్యరు. మనచుట్టూ వున్న సమాజం మనను పెంచి పెద్దచేసిన మన తల్లిదండ్రులు, మన చిన్నతనంలో మనను యేదోవిధంగా ప్రభావితం చేసే మన బంధువులు, స్నేహితులు ముందు ముందు జీవితం పట్ల మన ఆలోచనలు, మన నడవడి, మన అభిప్రాయాలు ఎలా ఉండాలో నిర్ణయం చేస్తారు. మన జీవితంలో ఒకానొక దశ గడిచాక మనం మానసికంగా యెదగడం మానేస్తాము. కమల, కల్యాణి మన సమాజానికి అలాంటి స్థిరత్వాన్ని కల్పించే వాళ్ళల్లో ఒకరనిపించింది.

* * *

మోహనరావును గూర్చి చాలాసార్లు ఆలోచించాను. అతడలా ఎందుకుంటాడు? అతన్ని నేనేమైనా మార్చలనా? రమణారావును, ప్రసాద్‌ను, ఆనందరావును నవ్వించినట్లుగా అతన్ని నవ్వించగలనా? ఎవరితోనైనా ఇట్టే మాటలు కలుపగలను. పరిచయం

చేసుకోగలను. ఆ పరిచయాన్ని స్నేహంగా మార్చుకోగలను - అనుకునే నాలోని ఆత్మవిశ్వాసానికి మోహనరావొక సవాల్‌గా తోచాడు.

రెండు మూడు సార్లు అతన్ని పలకరించబోయాను. విష్ చెయ్యటం తప్ప ఇంకేమీ మాట్లాడటానికి అతడు అవకాశమిచ్చేవాడు కాడు.

ఒకరోజు తెగించి అడిగేశాను.

''యేమిటండి మోహనరావుగారూ? మీరెప్పుడూ అలా సీరియస్‌గా ఉంటారెందుకు?'' అన్నాను.

అనుకోకుండా ఎదురైన నా ప్రశ్న అతన్ని కొంచెం ఇబ్బంది పెట్టిందని అతని మొహం స్పష్టంగా చెప్పింది. అయినా అతడు నవ్వటానికి ప్రయత్నించాడు.

''అందరూ నీలాగ ఎప్పుడూ నవ్విస్తూ ఉండేంత అదృష్టవంతులుగా పుట్టొద్దు?'' అన్నాడు.

''హాయిగా నవ్వటానికి పెద్ద అదృష్టమెందుకండి. నవ్వే శక్తిని సృష్టి ప్రతివాళ్లకూ ఇచ్చింది''

''నిజమే... సృష్టి మనకిచ్చిన అన్ని శక్తుల్నీ మనం ఉపయోగించుకోగల్గుతున్నామా? ఇట్స్ మ్యాటరాఫ్ లక్''

అంతటితో మా సంభాషణ ఆగిపోయింది. అతడు తను చేస్తున్న పనివైపు తన దృష్టిని మళ్లించాడు.

* * *

ఒకసారి మోహనరావును ఓ సినిమా హాల్లో చూసి చాలా ఆశ్చర్యపడ్డాను. అతడు సినిమాలు కూడా చూస్తాడా అనిపించింది.

ఆరోజు ఆదివారం.

అంతకుముందురోజే రమణారావు ఆఫీసులోనే అడిగాడు. ''మీకు గుల్జార్ పిక్చర్సంటే చాలా ఇష్టం కదూ?''

''అఫ్‌కోర్స్''

''రేపు 'మౌసమ్' మార్నింగ్‌షో ఉంది. చూస్తారా?''

''చూస్తారా అనటం బదులు చూద్దామా అంటే చాలా సంతోషించేదాన్ని... ఎందుకంటే నేను కంపెనీ లేకుండా సినిమాలు చూడను...''

రమణారావు కొంచెం తటపటాయించాడు.

''అలాగే అడుగుదామనుకున్నాను. కానీ మీరేమనుకుంటారోనని...''

''నేనేదో అనుకుంటానని మీకెందుకనిపించింది''

''మీలాంటి యువతులు పరాయి మొగవాడితో...''

నేను గట్టిగా నవ్వాను.

''స్వంత మొగవాడంటూ ఉంటేగదా మీరు పరాయిమొగవాడయ్యేది... అయినా మీరు నాకు కొత్తకాదుగా... యూ ఆర్ మై కొలీగ్ అండ్ ఫ్రెండ్... మీరు మీ మగ ఫ్రెండ్‌తో ఇలాంటి సందేహాలేవీ లేకుండా... సినిమాలు చూస్తారా చూడరా? ఫ్రెండ్‌షిప్ విషయంలో ఆడామగా అన్న భేదాన్ని చూపటం నాకు నచ్చదు''

''మీరు చాలా రెవల్యూషనరీ అండీ. ఆడవాళ్ళంతా మీలాగ ఆలోచిస్తే ఈ సమాజం ఏనాడో మారిపోయేది''

''ఆడవాళ్ళే కాదు... మొగవాళ్ళు కూడా నాలాగే ఆలోచిస్తే సమాజం మారుతుంది. ఆడవాళ్ళతో స్నేహమనగానే అదేదో అపూర్వ విషయమన్నట్టుగా ప్రవర్తించటం, దానికి మామూలు ఫ్రెండ్‌షిప్‌ని మించిన మరేదో అంశాన్ని ఆపాదించడం మానెయ్యాలి. స్త్రీని ఓ సెక్స్ సబ్జెక్టు అని కాకుండా ఓ హ్యూమన్ బీయింగ్‌గా చూడటం నేర్చుకోవాలి.''

''తప్పకుండా... అయితే రేపు మార్నింగ్ షో 'మౌసమ్' చూద్దాం... వస్తారా?''

''యే థియేటర్లో?''

''విజయాలో... తప్పకుండా వస్తారుగా?''

''ఓ యస్... తప్పకుండా వస్తాను''

* * *

తెల్లారి పదకొండు గంటలకు థియేటర్ దగ్గరకు రాగానే నా కోసం రమణారావు ఆతురతగా ఎదురుచూస్తున్నాడు. టికెట్స్ కూడా తీసుకున్నాడు. రమణారావు మామూలుగానే ఎంతో విలాసంగా డ్రెస్ చేసుకుంటాడు. ఈరోజు ఇంకా ప్రత్యేకంగా డ్రెస్ చేసుకోవడం గమనించాను.

''కమాన్... వెడదాం రండి'' అన్నాడు రమణారావు అటూ ఇటూ మమ్మల్నెవరైనా చూస్తున్నారేమోనని పరికించి చూస్తూ.

నా దృష్టి కౌంటర్ దగ్గర టికెట్ తీసుకుంటున్న మోహనరావు మీద పడింది.

''అరె... మోహనరావుకూడా పిక్చర్ కొచ్చినట్టున్నాడే'' అన్నాను.

''వస్తే వచ్చాడు... మనం త్వరగా లోపల కెడదాం పద'' అసహనంగా అన్నాడు రమణారావు. అతనిలోని ఆ అసహనానికి కారణమేమిటో సులభంగానే ఊహించగల్గాను.

ఇంతలో మోహనరావు మమ్మల్ని చూశాడు.

''హల్లో మోహనరావుగారూ. మీరు కూడా పిక్చర్‌కొచ్చారా?''

నవ్వుతూ పలకరించానతన్ని. నేనతన్నలా పలకరించటం రమణారావుకి చాలా

ఇబ్బందిగా ఉందని గమనించాను.

''ఔనండి. యేదో గుల్జార్ తీసిన పిక్చరంటే చూద్దామని వచ్చాను. మొదటిసారి వచ్చినప్పుడు మిస్సయ్యాను''

''నేనూ అంతే... కలిసే చూద్దాం రండి''

''నేను తర్వాతొస్తాన్లెండి... మీరు వెళ్లండి '' మోహనరావు తప్పించుకోవటానికి ప్రయత్నించాడు.

''టికెట్ తీసుకొన్నారుగా... టైమ్ కూడా అయ్యింది. వెడదాం రండి. ముగ్గురం కలిసే చూద్దాం'' అన్నాను.

మర్యాద కోసమైనా రమణారావు అతన్ని రండని ఆహ్వానించకపోవటం ఆశ్చర్యాన్ని కలిగించింది.

మోహనరావు మాతోపాటే లోపల కొచ్చాడు. వాళ్లిద్దరిమధ్య నేను కూర్చున్నాను.

''మీరు పిక్చర్స్ బాగా చూస్తుంటారా?''

''బాగా చూడను. బాగుందనుకొంటే చూస్తాను''

''ఈ పిక్చర్ బాగుంటుందన్న నమ్మకంతోనే చూస్తున్నారా?''

''గుల్జార్ తీస్తే కాస్తయినా బావుండకపోతుందా?''

''చూడకుండానే బావుంటుందని ఎలా చెప్పడం?'' ఎలాగైనా అతనితో సంభాషణ పొడిగించాలని నా ప్రయత్నం.

''గుల్జార్ తీశాడు కాబట్టి తప్పకుండా బావుంటుంది'' అన్నాడు రమణారావు చాలా కోపంగా. మోహనరావు కలిసినప్పట్నించి రమణారావు నిప్పులమీద కూర్చున్నట్లుగా ఉన్నాడని గమనిస్తూనే ఉన్నాను.

''గుల్జార్ పిక్చర్స్‌ను గూర్చి మీ అభిప్రాయమేమిటి?'' మోహనరావు నడిగాను.

''గుల్జార్ డైలాగ్స్ చాలా గొప్పగా రాస్తాడు. చాలా సహజంగా. సన్నివేశానికి పాత్రకు తగ్గట్టుగా ఎంతో సజీవంగా ఉంటాయి గుల్జార్ రాసే డైలాగ్స్ కాని అతడు తీసుకొనే కథలు... అతని డైరెక్షన్ అతని డైలాగ్స్ స్థాయిని అందుకోలేవు. అతడు తీసుకున్నవే స్టోరీస్ చాలా వరకు యేదో ఒక ఫారెన్ పిక్చర్‌నుండి తీసుకున్నవే అయ్యుంటాయి. వాటినే ఇండియనైజ్ చేస్తాడు. హీ హేజ్ నాట్ హిజోన్ ఫార్ములా...''

మోహనరావు సినిమాలను గూర్చి ఎంతో చక్కగా మాట్లాడటం నన్నెంతో ఆశ్చర్యపరిచింది.

''నాన్సెన్స్! గుల్జార్ ఫారెన్ పిక్చర్స్‌ను కాపీ చేస్తాడా?'' అన్నాడు రమణారావు.

''ఔను. ఆయనకెంతో పేరు తెచ్చిన 'కోషిష్' అన్న పిక్చర్‌కు యేదో జాపనీస్ పిక్చర్

ఆధారమట'' అన్నాను.

ఇంతలో పిక్చర్ మొదలెట్టారు.

పిక్చర్ పూర్తయ్యాక ''పిక్చర్ ఎలా ఉందండి?'' అన్నాన్నేను మోహనరావు నుద్దేశించి. కాని రమణారావు సమాధానం చెప్పాడు.

''గ్రాండ్‌గా ఉంది. షర్మిలా టాగోర్ యాక్షన్ సూపర్బ్ రియల్లీ గ్రేట్ పిక్చర్''

''మీరేమంటారు?'' మోహనరావును మళ్లీ అడిగాను.

''అంత గొప్ప పిక్చరని నాకేమీ అనిపించలేదు. కొత్తదనం చాలా తక్కువ. ప్రాస్టిట్యూట్‌ను గూర్చి ఇలాంటి పిక్చర్స్ చాలా వచ్చాయి...''

''ఇంతకూ మీ అభిప్రాయమేమిటి?'' నాకేసి చూసి అడిగాడు రమణారావు.

''మోహనరావుగారి అభిప్రాయమే నా అభిప్రాయం'' అన్నాను.

నా సమాధానం రమణారావుకు చాలా కోపాన్ని తెప్పించింది.

''నాక్కొంచెం పనుంది. మీరిద్దరూ మెల్లిగా రండి'' అంటూ రుసరుసలాడ్తూ రమణారావు వెళ్లిపోయాడు.

నాలో నేను నవ్వుకున్నాను.

మనుష్యులెంత చిత్రంగా ప్రవర్తిస్తారు! అతన్తో పిక్చర్‌కు రావటానికి వప్పుకున్నందుకు, అతడు నా కోసం ఒక టికెట్ తీసుకున్నందుకు అతనికి నామీద ఏదో హక్కువుందని ఫీలయ్యాడు. మోహనరావు వచ్చి తన హక్కును లాక్కున్నాడని కోపగించుకున్నాడు. కాస్సేపటివరకు నేనతని ప్రాపర్టీని భావించాడు. ఈ దేశంలో తాళిగట్టిన భార్యల్ని వాళ్ల భర్తలు జీవితాంతం వరకు తమ ప్రాపర్టీలుగా చూడటంలో ఆశ్చర్యమేమీ లేదనిపించింది.

కొంతదూరం నడవగానే తనుకూడా వెడతానన్నాడు మోహనరావు. నేను రిక్షా ఎక్కి ఇల్లు చేరుకున్నాను.

* * *

ఆఫీసులో మోహనరావు ప్రవర్తన నా విషయంలో చాలా మారింది. అప్పుడప్పుడు నాతో చనువుగా మాట్లాడటం మొదలెట్టాడు. ఎవరితోనూ ఆఫీసు విషయాలు తప్ప మరో విషయం మాట్లాడని మోహనరావు నాతో కాస్త చనువుగా మాట్లాడటంతో మా ఆఫీసులో చాలామంది కనుబొమ లెగరేశారు.

ఒకరోజు క్యాంటీన్‌లో టీ తాగుతోంటే కమల అడిగింది. ''మొత్తానికి మోహనరావును కూడా మార్చేశావే''

''నేను మార్చిందేమీ లేదు... ఎవరైనా సరే మనం మాట్లాడితే మాట్లాడుతారు. మనం బిగదీసుకుని కూర్చుంటే వాళ్ళు కూడా బిగుసుకుని కూర్చుంటారు. నల్గురం కలిసి

ఒకచోట పనిచేస్తున్నాం కాబట్టి ఎవరి లోకంలో వాళ్ళుండక ఒకర్నొకరు అర్థం చేసుకొని ఆ ఉన్న నాల్గు రోజులు స్నేహంగా ఉంటే బావుంటుందని నా ఉద్దేశం. అంతకుమించి ఇంకేమీ లేదు.''

''నీలాంటి పెళ్లికాని వాళ్ళు ఏం చేసినా చెల్లుతుంది. మాలాగా సంసారం, పిల్లలూ ఉన్నవాళ్లకు అందరితో స్నేహంగా ఉండాలంటే వీలౌతుందా?''

''పెళ్ళయినంత మాత్రాన మన జీవితం అంతగా ఎందుకు కుంచించుకుపోవాలో నా కర్థం కాదు... చదువుకోని అమాయకులైన స్త్రీలు, ఆర్థికంగా తమ కాళ్ళమీద తాము నిలబడలేని స్త్రీలు భర్తలకు బానిసలుగా పడి ఉంటున్నారంటే అర్థం చేసుకోవచ్చు. కాని మనం... చదువుకొన్నావము. ఉద్యోగం చేస్తున్నావము... మనం కూడా ఇంతగా భయపడాలా? పెళ్ళి కాకముందు ఎంతో స్వేచ్ఛగా ఉండే స్త్రీలు కూడా పెళ్ళి కాగానే భర్త విధించిన పరిధిలోంచి బయటపడకపోవటం నన్ను నిజంగా షాక్ చేస్తుంది... అందుకే పెళ్ళంటే బానిసత్వానికి మరో పేరనిపిస్తుంది నాకు....''

''అందుకే జీవితాంతం పెళ్ళి చేసుకోకుండా బ్రహ్మచారిణిగా ఉండిపోతావా?''

నేను నిర్లిప్తంగా నవ్వాను.

''నాకు పెళ్ళి కాలేదని మీ రెందుకనుకుంటున్నారు?''

''ఏమిటీ? నీకు పెళ్ళయిందా?'' ఆశ్చర్యంగా అడిగింది కమల.

''ఔను. ఏం?''

''నీ ధోరణి చూస్తే కాలేదనిపించింది''

''మనుష్యుల ధోరణి చూసి పెళ్ళయిందో కాలేదో చెప్పొచ్చునంటారా?''

''ఏమిటోనమ్మా! నువ్వెప్పుడూ ఇలా చిత్రంగా మాట్లాడతావు...'' రుసరుసలాడుస్తూ వెళ్లిపోయింది కమల.

* * *

నాతో ఆ రోజు సినిమాకొచ్చినప్పట్నించి రమణారావు నాతో మాట్లాడటం మానేశాడు. నేను పలకరించినా చాలా ముభావంగా జవాబు చెప్పేవాడు.

ఆఫీసులో చాలామందికి నేను మోహనరావుకు దగ్గరవుతున్నానని నామీద కన్నెర్రగా ఉందని గమనించాను. వాళ్ల ప్రవర్తనను ఎలా అర్థం చేసుకోవాలో తెలియలేదు. నేను అందరితోను కలుపుగోలుగా ఉండాలని అందరితోనూ సరదాగా మాట్లాడాలని ప్రయత్నించేదాన్ని. ఆ ప్రయత్నంలోని భాగమే మోహనరావుతో కూడా నేను పరిచయాన్ని పెంచుకోవటం.

నా చుట్టూ వున్న మనుష్యులమీద నా కిదివరకున్న అభిప్రాయాలు మారటం

ప్రారంభించాయి.

* * *

ఒకరోజు సాయంత్రం నేను షాపింగ్‌కు వెళ్ళి ఇంటికొస్తున్నాను. మా ఇంటి ముందునుంచే మోహనరావు వస్తున్నాడు.

''హల్లో మోహనరావుగారూ''

''హల్లో వనజగారూ''

''మా ఇల్లిక్కడే... రండి కాస్సేపు కూర్చొని వెడుదురుగానీ...''

''ఎందుకులెండి... మన గురించి ఇప్పటికే మన ఆఫీసులో గుసగుసలు ప్రారంభమయ్యాయి. ఇక నేను మీ ఇంటికొచ్చానని తెలిస్తే ఇంకేమన్నా ఉందా?''

''ఏం ఫరవాలేదు రండి. ఐ డోంట్ కేర్ సచ్ రూమర్స్... మనం వాళ్ళ గుసగుసల్ని పట్టించుకుంటున్నామని తెలిస్తే వాళ్ళింకా విజృంభిస్తారు''

తాళం తీసి మోహనరావును లోపల కాహ్వానించాను.

''మీలాగ ధైర్యంగా ఉండే స్త్రీలంటే నాకిష్టం''

''ధైర్యం కాదండి... అది నా జీవిత విధానం. ఎవరేమన్నా సరే నా జీవితాన్ని నాకిష్టమైన పద్ధతిలో మలచుకుంటాను. ఎవరికోసం కూడా నా స్వేచ్ఛను, వ్యక్తిత్వాన్ని కోల్పోను...''

''మీ పర్సనల్ విషయాలను గూర్చి అడుగుతున్నానని యేమీ అనుకోకండి. మీరు పెళ్ళి చేసుకోరా?''

''పెళ్ళనేది మన స్వేచ్ఛను, మన వ్యక్తిత్వాన్ని చంపేస్తుందని నా చుట్టూ ఉన్నవాళ్లను చూస్తే నాకనిపించింది. నేను కూడా మిమ్మల్ని ఇదే ప్రశ్న అడుగుదామనుకుంటున్నాను. మీకు పెళ్ళయ్యిందా? మీ పెళ్ళిని గూర్చి మన ఆఫీసులో రకరకాల పుకార్లున్నాయి''

''ఎలాంటి పుకార్లు?''

''కొందరు మీకు పెళ్ళయ్యింది... కాని భార్యను వదిలేశాడని చెప్పుకుంటారు. మరికొందరు ఆ భార్యే మిమ్మల్ని వదిలేసిందంటారు. అందుకే మీరలా ఎప్పుడూ దిగులుగా వుంటారని చెబుతారు. కొందరేమో మీకసలు పెళ్ళే కాలేదంటారు. నిజమేమిటో మిమ్మల్నే అడిగి తెలుసుకోవాలనుకున్నాను''

మోహనరావు చాలా సీరియస్‌గా మారిపోయాడు.

''చెప్పండి... కొన్ని విషయాల్ని మనం ఎప్పుడూ మన మనసులో పెట్టుకొని మధన పడేకన్నా ఎదుటివాళ్లతో చెప్పుకుంటే మన గుండెల భారం కొంత తగ్గుతుంది''

''అదంతా నాకు తెలీదుగాని ఎందుకో ఈ క్షణంలో మీతో అంతా చెప్పెయ్యాలని పిస్తోంది''

''చెప్పండి''

రెండు మూడు క్షణాలాగి మోహనరావు మొదలెట్టాడు.

''ఔను... నాకు పెళ్ళయింది. కాని ఎప్పుడో తెలుసా? నా కప్పుడు పన్నెండేళ్ళు కూడా ఉంటాయో... ఉండవో... ఆ అమ్మాయి మరీ పసిపిల్ల. ఏడెనిమిది యేళ్ళుంటాయేమో. మా బంధువులమ్మాయే... మా అమ్మమ్మ బలవంతంమీద ఆ పెళ్ళి జరిగిందట. పెళ్ళయిపోగానే మా అమ్మమ్మ చనిపోయింది. అంతే ఆ అమ్మాయి తల్లిదండ్రులకు మా తల్లిదండ్రులకు బెడిసింది. వాళ్లు ఇస్తానన్నంత కట్నం ఇవ్వలేదుట. మాకూ వాళ్ళకు సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి.

నేను పెరిగి పెద్దవాడ్నయ్యాను. పట్నం వెళ్లి చదువుకున్నాను. జీవితమంటే యేమిటో తెలుసుకున్నాను. పెళ్ళిని గూర్చి, స్త్రీ పురుషుల మధ్య ఉండాల్సిన సంబంధాలను గూర్చి నాలో కొన్ని అభిప్రాయా లేర్పడ్డాయి. స్త్రీ పురుషులమధ్య అన్యోన్యత, అవగాహన లేని పెళ్లి పెళ్ళే కాదు. నాకెప్పుడో జరిగిన పెళ్ళి పెళ్ళే కాదనిపించింది. ఎక్కడో ఓ మారుమూల పల్లెటూళ్ళో ఉన్న ముక్కూ మొహం తెలియని ఓ అమ్మాయిని నా భార్యగా స్వీకరించలేక పోయాను. మావాళ్లు నన్ను వేరే పెళ్ళి చేసుకోమన్నారు. ఆ అమ్మాయి తరఫు వాళ్ళొచ్చి గొడవ చేస్తారని మా బంధువులెవరూ నాకు వాళ్ళమ్మాయి నివ్వటానికి ఒప్పుకోలేదు. అయినా నాకు మా బంధువులమ్మాయి లెవర్నీ చేసుకోవాలనిపించలేదు. ఎవరైనా చదువు సంస్కారం కలిగి నన్ను అర్థం చేసుకోగల అమ్మాయిని చేసుకోవాలనుకున్నాను. కాని అలాంటి అమ్మాయి నాకింతవరకు తటస్థపడలేదు''

కాస్సేపు ఇద్దరమూ నిశ్శబ్దంగా ఉండిపోయాము.

''మీదే ఊరు?'' అడిగాను.

''ఒకప్పుడు మా ఊరు కొత్తపల్లి. ఖమ్మం దగ్గర ప్రస్తుతం నాకా ఊరుతో ఎలాంటి సంబంధం కూడా లేదు''

''ఆ అమ్మాయి యేమైందో తెలుసుకున్నారా?''

''పది పదిహేనేళ్ళుగా నాకేమి తెలియదు. అప్పుడే ఆ అమ్మాయికి మళ్ళీ పెళ్ళి చెయ్యండని వాళ్లవాళ్ళకు కబురు పంపించాను...''

''ఈ దేశంలో ఒకసారి పెళ్ళయిన స్త్రీకి మళ్ళీ పెళ్ళవుతుందని ఎలా అనుకున్నారు?''

''యేమో.... నాకు తెలీదు. కాని అజ్ఞానం, మూర్ఖత్వం, సాంప్రదాయం వీటికి బానిసైపోయిన చదువు సందెల్లేని ఓ పల్లెటూరి స్త్రీతో కాపురం చెయ్యటమంటే నాకు చాలా భయంకరంగా తోచింది''

''కాని భర్త వదిలేశాడన్న ముద్రపడ్డ ఆ అమ్మాయి జీవితం ఎంత భయంకరంగా మారుతుందో ఊహించారా?''

''కావొచ్చు. కాని ఆ పరిస్థితుల్లో నన్నేం చెయ్యమంటారు''

''ఆ అమ్మాయికి చదువు సందెలు చెప్పించి ఆమెలో మీరుందనుకుంటున్న ఆ అజ్ఞానాన్ని, మూర్ఖత్వాన్ని పోగొట్టే ప్రయత్నం చేశారా?''

''అదంత సులువు కాదండి. ఈ స్త్రీలు మారరండి. మారరుగాక మారరు. చదువుకున్న స్త్రీలే ఎంతో మూర్ఖంగా, సిల్లీగా ప్రవర్తించటం చూశాను. ఇక చదువుకోని పల్లెటూరి స్త్రీల మాటా?''

''మీకు స్త్రీలను గూర్చి చాలా లో ఒపీనియన్ ఉన్నట్టుందే''

''అందరు స్త్రీలను గూర్చి కాదు... మీలాంటి స్త్రీలంటే నాకు చాలా గౌరవం''

''మీరు వదిలేసిన ఆ పల్లెటూరి స్త్రీని నేనేనని తెలిస్తే నామీది గౌరవం అలాగే ఉంటుందా?''

''వనజా... యేమిటి నువ్వనేది...''

''ఔను ఆ అమ్మాయిని నేనే... ఒపదేళ్ళపాటు మొగుడొదిలేసిన అమ్మాయి అన్న నిందను మోసిన ఆ అభాగ్యురాలిని నేనే... ఇక ఆ ఊళ్ళో ఉండలేక పట్నం వెళ్లాను. అక్కడ మా మామయ్య నన్ను చదివించి నన్నీ ఉద్యోగంలో పడేశాడు...''

అతడలాగే నోరు తెరచుకొని ఉండిపోయాడు. అతనితో నేనింకేమీ మాట్లాడలేకపోయాను.

కాస్సేపు నిశ్శబ్దంగా కూర్చొని అతడు వెళ్లిపోయాడు.

* * *

ఎప్పుడో తెలిసీ తెలియక చేసిన పొరపాటుకు తనను క్షమించమని, మీకు అభ్యంతరం లేకపోతే మనం భార్యాభర్తలుగా కలిసి ఉందామని అతడు నాకో లెటర్ రాశాడు.

నాకు చాలా అభ్యంతరాలున్నాయని, ఇలా ఒంటరిగా, స్వేచ్ఛగా బ్రతకటమే నాకిష్టమని ఎప్పటిలాగే మనం ఫ్రెండ్స్‌గా ఉందామని అతనికి సమాధానం రాశాను.

కొద్దిరోజుల్లోనే అతడా ఊరినుండి ట్రాన్స్‌ఫర్ చేయించుకొని వెళ్లిపోయాడు. ★

(ప్రభవ - అక్టోబర్ '78)